సాక్షి
సూర్యాపేట
గురువారం । 23 । నవంబర్ । 2023



మహిళల భాగస్వామ్యం పెరగాలి
క్రీడల్లో మహిళల భాగస్వామ్యం మరింత పెరగాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డి అన్నారు. - 10లో



బీఆర్‌ఎస్‌ను గద్దె దింపేందుకే..
బీఆర్‌ఎస్‌ను గద్దె దింపేందుకే కాంగ్రెస్‌కు మద్దతిచ్చినట్లు టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. - 10లో



డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే..
డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రచనారెడ్డి అన్నారు. - 10లో

న్యూస్‌రీల్

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల వ్యయ పరిశీలకుడు దీపక్‌మిశ్రా

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సాధారణ, పోలీస్ పరిశీలకుడు దీపక్ మిశ్రా సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్. వెంకట్రావ్, ఎస్పీ రాహుల్ హెగ్డే, ఎన్నికల సాధారణ పరిశీలకులు బాలకిషన్ ముండా, కౌశిగన్‌లతో కలిసి ఎన్నికల నిర్వహణ కమిటీలు, నోడల్ అధికారులు, సెక్టార్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటింటికీ ఓటర్ స్లిప్పుల పంపిణీని వేగిరం చేయాలని, ఓటింగ్ శాతం పెంచాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి ఎస్. వెంకట్రావ్ మాట్లాడారు. నాలుగు నియోజకవర్గాల్లో 738 ప్రాంతాల్లో 1,201 పోలింగ్ కేంద్రాలు, 9,85,962 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. కలెక్టరేట్‌లో మీడియా సెంటర్, బ్యాంక్ లావాదేవీల కేంద్రం, ఇంటిగ్రేటెడ్ ఎలక్షన్ కంట్రోల్ రూమ్‌లను పరిశీలించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంక, అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీలు నాగభూషణం, రవి పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందోబస్తు



మాట్లాడుతున్న ఎస్పీ, పక్కన కలెక్టర్

సూర్యాపేట క్రైం: ఎన్నికల నిర్వహణకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే బీకే తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోలీసు బందోబస్తు, యాక్షన్ ప్లాన్‌పై బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎన్నికల జనరల్, పోలీస్ పరిశీలకులతో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకట్రావుతో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. జిల్లా ఎన్నికల అధికారి వెంకట్రావు మాట్లాడుతూ ఎన్నికల సామగ్రికి, ఎన్నికల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి రక్షణ కల్పించాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల భద్రత పక్కాగా ఉండాలన్నారు. సమావేశంలో పోలీస్ పరిశీలకుడు ఫర్హత్ అబ్బాస్, కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల జనరల్ పరిశీలకుడు కౌశిక్, సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల జనరల్ పరిశీలకుడు బాలకిషన్ ముండా, అదనపు ఎస్పీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు హుజూర్‌నగర్, దేవరకొండలో కేటీఆర్ రోడ్ షోలు

హుజూర్‌నగర్,దేవరకొండ : బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం హుజూర్‌నగర్, దేవరకొండలో రోడ్ షోలు నిర్వహించనున్నారు. హుజూర్‌నగర్‌లో అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, దేవరకొండలో అభ్యర్థి రమావత్ రవీంద్రకుమార్ విజయాన్ని కాంక్షిస్తూ రోడ్ షోలలో ఆయన పాల్గొననున్నారు. కేటీఆర్ ఉదయం 9.30 గంటలకు హుజూర్‌నగర్‌కు హెలికాప్టర్‌లో రానున్నారు. ఉదయం 10 గంటలకు లింగగిరిరోడ్డు నుంచి రోడ్‌షో ప్రారంభమై పాత బస్టాండ్ మీదుగా మిర్యాలగూడ అడ్డరోడ్డు వరకు సాగనుంది. అక్కడ 11 గంటలకు ప్రసంగించనున్నారు. ఈ రోడ్ షోలను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

పీఓ, ఏపీఓలకు శిక్షణ



పీఓ, ఏపీఓలకు శిక్షణ ఇస్తున్న ట్రైనర్

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట నియోజకవర్గ పరిధిలో ఎన్నికల విధులకు హాజరయ్యే పీఓ, ఏపీఓలకు బుధవారం స్థానిక ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సూర్యాపేట ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.వీరబ్రహ్మచారి మాట్లాడుతూ పీఓలు, ఏపీఓలు ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు, బీయూ, సీయూలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల విధులకు గైర్హాజరయ్యే సిబ్బందిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌ఓలు శ్యాంసుందర్‌రెడ్డి, కృష్ణయ్య, మహేందర్‌రెడ్డి, ఎంపీఓలు గోపి, సంజీవ, శిక్షకులు వెంకటేశ్వర్లు, ఆర్‌ఐలు రవి, శ్రీధర్ పాల్గొన్నారు.

జన జాతరలా బహుజనుల సభ

- హాజరైన బీఎస్పీ అధినేత్రి మాయావతి

సూర్యాపేట : సూర్యాపేట మండలం గాంధీనగర్‌లో బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన బహుజన రాజ్యాధికార సభ బుధవారం జనజాతరను తలపించింది. సూర్యాపేట బీఎస్పీ అభ్యర్థి వట్టె జానయ్యయాదవ్‌కు మద్దతుగా నిర్వహించిన ఈ సభకు బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరయ్యారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి తరలివచ్చిన పార్టీ శ్రేణులు, అభిమానులు, రెపరెపలాడుతున్న జెండాలతో సూర్యాపేట–జనగామ హైవే నీలి వనమైంది. సభ మధ్యాహ్నం ఒంటి గంటకు ఉండగా 11 గంటల నుంచే జనం సభాప్రాంగణానికి భారీగా రావడం మొదలైంది. గిరిజన మహిళల నృత్యాలు, గొల్ల కురుమల డిల్లెం బల్లెం .. ఇలా సబ్బండ వర్గాల ప్రజలు సమూహాలుగా బయల్దేరి నృత్యాలు చేస్తూ సభా ప్రాంగణానికి చేరుకున్నారు. వేదికపై కళాకారులు తమ ఆటాపాటలతో సభికులను ఆకట్టుకున్నారు. మాయావతి, డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ల ప్రసంగం వినేందుకు జనం పోటెత్తారు. ఓటు అనేది ప్రజల తలరాతను, తెలంగాణ భవిష్యత్‌ను ప్రభావితం చేస్తుందని, ఆలోచించి ఓటు వేయాలని డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ చెప్పినప్పుడు ప్రజల నుంచి స్పందన వచ్చింది.



మాయావతిని గజమాలతో సన్మానిస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, తదితరులు



బహుజన రాజ్యాధికార సభకు హాజరైన బీఎస్పీ కార్యకర్తలు

ఇందిరమ్మ రాజ్యానికి నాంది పలకాలి

నల్లగొండ నుంచే కాంగ్రెస్ విజయం ప్రారంభం కావాలి

- సాగర్ ప్రాజెక్టును నిర్మించింది కాంగ్రెస్సే..
- ఈ ప్రాంతాన్ని రైస్‌బౌల్‌గా మార్చాం
- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే
- నీలగిరిలో ప్రజా భరోసా సభ



అభివాదం చేస్తున్న మల్లికార్జున ఖర్గే, నల్లగొండ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండలో జరిగిన కాంగ్రెస్ పార్టీ ప్రజా భరోసా బహిరంగ సభకు బోనాలతో వస్తున్న మహిళలు

నల్లగొండ : పేదలు, రైతులు, మైనార్టీలకు న్యాయం జరగాలంటే ఇందిరమ్మ రాజ్యం రావాలని.. అందుకు నల్లగొండనే నాంది పలకాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. నల్లగొండలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ప్రజా భరోసా సభలో ఆయన మాట్లాడారు. నల్లగొండకు గొప్ప చరిత్ర ఉందన్నారు. నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్ ప్రాజెక్టును కాంగ్రెస్ నిర్మించిందని గుర్తుచేశారు. దాంతోనే నల్లగొండ రైస్ బౌల్ జిల్లాగా మారిందన్నారు. కేసీఆర్ పాలనకు చరమగీతం పాడాలని.. నల్లగొండ నుంచే కాంగ్రెస్ విజయం ప్రారంభం కావాలని కోరారు. నల్లగొండలో సీనియర్ నాయకుడైన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితోపాటు ఉమ్మడి జిల్లాలోని అన్ని స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

భారీగా హాజరైన శ్రేణులు

కాంగ్రెస్ నల్లగొండ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గెలుపును కాంక్షిస్తూ నల్లగొండ మర్రిగూడ బైపాస్ రోడ్డులోని ఇందిరా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ సభకు నియోజకవర్గ వ్యాప్తంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జైజై వెంకన్న అంటూ నల్లగొండ గద్దర్ (నర్సిరెడ్డి) పాటలకు ప్రజలు ఈలలు కొడుతూ కాంగ్రెస్ జెండాలు ఊపుతూ చిందులు వేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సాయంత్రం 5.06 గంటలకు హెలికాప్టర్‌లో రాగానే.. సభా ప్రాంగణమంతా కేరింతలతో మార్మోగింది. ఖర్గే ప్రసంగాన్ని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలుగులో అనువాదం చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ



రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే..



రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్, నల్లగొండ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. డిసెంబర్ 3న తాను ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమని, 60 నుంచి 70 వేల మెజార్టీ ఇవ్వాలని నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



చేయి గుర్తు, కోమటిరెడ్డి ప్లకార్డులతో యువకుల ఉత్సాహం

70 నుంచి 80 స్థానాల్లో విజయం ఖాయం



రాష్ట్రంలో 70 నుంచి 80సీట్లలో విజయం సాధించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నల్లగొండలో కోమటిరెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పదేళ్ల కేసీఆర్ పాలన అవినీతిమయంగా మారిందని ఆరోపించారు. రైతులు, నిరుద్యోగులను కేసీఆర్ మోసం చేశారని మండిపడ్డారు. తెలంగాణ సమాజం అంతా ఏకమై కేసీఆర్ పాలనను బొంద పెట్టాలని పిలుపునిచ్చారు.

నేటి నుంచి ఇంటి వద్దే ఓటు

- 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, వికలాంగులకు పోస్టల్ బ్యాలెట్
- మూడు రోజులపాటు ప్రక్రియ
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- నాలుగు నియోజకవర్గాల్లో 1,008 మంది ఓటర్లు



నియోజకవర్గం	పోస్టల్ బ్యాలెట్‌కు అర్హులు	దరఖాస్తు చేసుకున్నవారు
హుజూర్‌నగర్	8,247	267
కోదాడ	8,422	176
సూర్యాపేట	6,728	229
తుంగతుర్తి	8,057	336
మొత్తం	31,454	1,008

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటుహక్కు వినియోగించుకోలేని వారికి ఇంటి వద్దే ఓటు వేసేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా 80 ఏళ్లకు పైబడిన వృద్ధులు, 40 శాతం పైన వికలాంగత్వం గల దివ్యాంగులు 12–డీ ఫారం ద్వారా దరఖాస్తు చేసుకుంటే ఇంటి వద్దనే ఓటుహక్కు వినియోగించుకునేలా అవకాశం కల్పించింది. దీంతో జిల్లాలో 1008 మంది ఇంటి నుంచి ఓటు వేయడానికి దరఖాస్తులు చేసుకున్నారు. గురువారం నుంచి మూడు రోజుల పాటు వారు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.

35 బృందాలు ఏర్పాటు

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 1,008 మంది దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లు ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారు. ఎన్నికల అధికారులు పోస్టల్ బ్యాలెట్లను ఇంటి వద్దకే తీసుకెళ్లి ఓటు వేయించనున్నారు. దీని కోసంజిల్లాలో 35 బృందాలను ఏర్పాటు చేశారు. ఓటర్ల సంఖ్యను బట్టి సూర్యాపేట నియోజకవర్గానికి ఐదు బృందాలు, కోదాడ 10, తుంగతుర్తి 7, హుజూర్‌నగర్ 11 బృందాల చొప్పున కేటాయించారు. ఒక్కో బృందంలో ముగ్గురు అధికారులు, ఒక వీడియో గ్రాఫర్, ఒక మైక్రో అబ్జర్వర్, ఒక పోలీస్ ఉంటారు. వీరంతా వారికి కేటాయించిన రూట్లలోనే పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న ఓటర్ల ఇంటికి వెళ్లి ఓటు వేయించనున్నారు. జిల్లాలో గురువారం(నేటి) నుంచి ఈ నెల 25 వరకు మూడు రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగనుంది. ముందుగా ఓటరుకు స్థానిక బీఎల్‌ఓ ద్వారా సమాచారం అందిస్తారు. ఎన్నికల సిబ్బంది ఓటరు ఇంటికి వెళ్లిన సందర్భంలో అతను లేకుంటే ఈ నెల 25న రెండవ సారి సిబ్బంది వెళ్తారు. అయినా ఓటరు ఓటు హక్కు వినియోగించుకోలేక పోతే ఆర్‌ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. కానీ పోలింగ్ కేంద్రాల్లో వినియోగించుకునే అవకాశం ఉండదు.

జిల్లాకు చేరిన బ్యాలెట్ పేపర్లు..

ఈ నెల 30న జరిగే పోలింగ్‌కు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ పేపర్లు జిల్లాకు చేరాయి. హైదరాబాద్‌లో ముద్రించిన బ్యాలెట్ పేపర్లు గత ఆదివారం రాత్రి జిల్లాకు చేరుకున్నాయి. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో ఆయా నియోజక వర్గాల ఓటర్లకు అనుగుణంగా బ్యాలెట్ పేపర్లను ముద్రించారు.

బంగారు తెలంగాణ బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం



జగన్నాయక్ తండాలో మాట్లాడుతున్న మంత్రి జగదీష్ రెడ్డి

చివ్వెంల : బీఆర్‌ఎస్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యమని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి చివ్వెంల మండల పరిధిలోని జగన్నాయక్ తండా, వల్లభాపురం, ఉండ్రుగొండ, తుల్జారావుపేట, గుంపుల, జి.తిరుమలగిరి గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మంత్రి మాట్లాడారు. పదేళ్ల పాలనలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 24 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. మేనిఫెస్టోలో లేని హామీలను, పథకాలను ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కిందన్నారు. రైతుల కోసం రైతు బంధు, రైతు బీమా, పేదల కోసం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్టు, గృహలక్ష్మి, బీసీ బంధు, దళిత బంధు వంటి పథకాలు ప్రవేశపెట్టి.. ప్రతి ఒక్కరికీ అందేలా చేశామన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా గుర్తించి వాటిని అభివృద్ధి చేశామని తెలిపారు. జగన్నాయక్ తండాను గ్రామ పంచాయతీ చేస్తామని హామీ ఇచ్చారు. కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జూలకంటి జీవన్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భుక్యా సంజీవ్ నాయక్, షేక్ భాషా, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరుల పాల్గొన్నారు.

ఫ్లోరైడ్‌ను పారదోలాం

- మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీరు
- కాంగ్రెస్ హయాంలో విషపు నీళ్లే గతి
- మునుగోడు దత్తతకు కట్టుబడి ఉన్నా
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



చౌటుప్పల్ రోడ్‌షోలో గద ప్రదర్శిస్తున్న కేటీఆర్

చౌటుప్పల్ : నల్లగొండ జిల్లా కొన్ని దశాబ్దాల కాలం ఫ్లోరైడ్ భూతం బారినపడిందని, దీనికి కాంగ్రెస్ పార్టీనే కారణమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ధ్వజమెత్తారు. 2009 సంవత్సరంలో అప్పటి స్పీకర్ ఆధ్వర్యంలో మునుగోడు నియోజకవర్గంలోని మర్రిగూడ, కుదాభక్ష్‌పల్లి గ్రామాల పర్యటనకు వెళ్లిన తాను ఫ్లోరోసిస్ బాధితులను చూసి చలించిపోయానని గుర్తుచేశారు. ఫ్లోరైడ్ నిర్మూలనలో భాగంగా కేసీఆర్ నాయకత్వంలో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి మంచినీళ్లు అందించామన్నారు. మునుగోడు ఎమ్మెల్యే అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా చౌటుప్పల్‌లో బుధవారం నిర్వహించిన రోడ్‌షోలో మంత్రి కేటీఆర్ మాట్లాడారు. గతేడాది ఉప ఎన్నికల్లో ఓడిపోయాక కనిపించకుండా పోయిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తిరిగి ఇప్పుడు ఎన్నికల పేరిట వస్తున్నాడని ఎద్దేవా చేశారు. మునుగోడు నియోజకవర్గాన్ని దత్తత తీసుకుంటామని గతేడాది జరిగిన ఉప ఎన్నికల సమయంలో తాను ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నానని కేటీఆర్ స్పష్టం చేశారు. ఆ ప్రకారంగానే నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేస్తున్నామని, రానున్న ఐదేళ్ల కాలంలో పూర్తి చేస్తామని తెలిపారు.

రూ.3వేల కోట్లతో అభివృద్ధి

మునుగోడు బీఆర్‌ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. నాలుగేళ్లు ఎమ్మెల్యేగా చేసిన రాజగోపాల్‌రెడ్డి హయాంలో నియోజకవర్గం వెనుకబడిందన్నారు. తాను ఇప్పటి వరకు నియోజకవర్గంలో 3వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టానని చెప్పారు. ఉప ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.570 కోట్ల నిధులు తీసుకువచ్చానన్నారు. అందుకు సంబంధించిన పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. మిగిలిన పనులన్నీ పూర్తి చేసేందుకు మరో అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ రాపోలు ఆనందభాస్కర్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్ పాల్గొన్నారు.



కోదాడ రోడ్‌షోలో అభివాదం చేస్తున్న కేటీఆర్, పక్కన అభ్యర్థి మల్లయ్య యాదవ్

టీడీపీ.. కాంగ్రెస్‌కు మద్దతివ్వడం సిగ్గుచేటు

కోదాడ: నియోజకవర్గానికి చుట్టపు చూపుగా వచ్చే నాయకుల మాయ మాటలు నమ్మవద్దని, ఎల్లప్పుడూ మీతో ఉండే నాయకులనే గెలిపించాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. బుధవారం కోదాడలో బీఆర్‌ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్‌కు మద్దతుగా నిర్వహించిన రోడ్‌షోలో ఆయన పాల్గొన్నారు. అనంతరం రంగాథియేటర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ మాట్లాడారు. కోదాడ నియోజకవర్గానికి కాళేశ్వరం జలాలలను తీసుకొచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా దివంగత ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించాడని, ఆయన బతికున్నంతకాలం కాంగ్రెస్‌పై పోరాటం చేశారని ఇప్పుడు అదే తెలుగుదేశం నాయకులు కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడం సిగ్గుచేటని ఆయన అన్నారు. డిసెంబర్ 3 తరువాత మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని అప్పుడు తెల్లకార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ సన్న బియ్యం ఇస్తామని, రైతుబంధు సాయం రూ.16 వేలకు పెంచుతామని, పింఛన్లను రూ.5 వేలకు, మహిళలకు సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా నెలకు రూ.3 వేలు ఇస్తామని అన్నారు. కోదాడలో బొల్లం మల్లయ్యయాదవ్ గెలిచిన తరువాత సీనియర్ నాయకుడు కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డికి రాష్ట్రస్థాయి పదవి వస్తుందని కేటీఆర్ చెప్పారు. కోదాడకు పాలిటెక్నిక్ కళాశాల, ఇండోర్ స్టేడియం, పట్టణాభివృద్ధికి రూ.100 కోట్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్య యాదవ్, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి, మున్సిపల్‌పల్ చైర్‌పర్సన్ వనపర్తి శిరీష, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



చౌటుప్పల్‌లో రోడ్‌షోకు హాజరైన ప్రజలు

ప్రజా భరోసా సభ


నల్లగొండలో నిర్వహించిన ప్రజా భరోసా సభలో మాట్లాడుతున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, చిత్రంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాణిక్‌రావు ఠాక్రే, విద్యాసాగర్‌రావు, శంకర్‌నాయక్ తదితరులు


సభా వేదికపై పాటలు పాడుతున్న 'నల్లగొండ గద్దర్' నర్సిరెడ్డి, నృత్యాలు చేస్తున్న కళాకారులు


ఖర్గేతో మాట్లాడుతున్న ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే


ఖర్గేకు శుభాకాంక్షలు తెలుపుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, కౌన్సిలర్లు


చంటిపాపతో సభకు హాజరై సెల్ఫీ దిగుతున్న మహిళ

బీఆర్‌ఎస్‌ను గద్దె దింపేందుకే..

- కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నాం
- తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం


తిరుమలగిరిలో మాట్లాడుతున్న తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం

హుజూర్‌నగర్ : తెలంగాణలో అవినీతి బీఆర్‌ఎస్‌ను గద్దె దింపేందుకు కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నట్లు తెలంగాణ జనసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. బుధవారం హుజూర్‌నగర్‌లో పదేళ్ల తెలంగాణ – ప్రజలు – కర్తవ్యాలు అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. అవినీతి, నిరంకుశ పాలనను ఓడించడానికి కాంగ్రెస్‌కు ఓటు వేయాలని ఆయన కోరారు. పదేళ్లుగా నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. నిరుద్యోగుల చావులకు ప్రభుత్వమే కారణమని ఆయన ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం నిరుద్యోగులు ఐక్య కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ మాజీ అధ్యక్షులు గుర్వారెడ్డి, నాయకులు సాముల శివారెడ్డి, యరగాని నాగన్న, బోద చక్రారెడ్డి, తన్నీరు మల్లిఖార్జున్, దొంతగాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో నిరంకుశ పాలన

తిరుమలగిరి (తుంగతుర్తి): తెలంగాణ రాష్ట్రంలో పదేళ్లుగా నిరంకుశ పాలన సాగిందని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. తిరుమలగిరిలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చట్టానికి అతీతంగా సీఎం కేసీఆర్ వ్యవహరిస్తున్నారని, ప్రశ్నించే వారిపై కేసులు పెడుతూ ఆంక్షలు విధిస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు రీ డిజైన్ పేరుతో కోట్ల రూపాయలు దోచుకుతిన్నారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమకారుడైన మందుల సామేల్‌ను తుంగతుర్తి నియోజకవర్గంలో గెలిపించాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దుంపల కృష్ణారెడ్డి, సుంకరి జనార్దన్, సంకెపల్లి కొండల్‌రెడ్డి, తిరుమని యాదగిరి, కందుకూరి లక్ష్మయ్య, బత్తుల శ్రీను, దాచేపల్లి వెంకన్న, రఘునందన్‌రెడ్డి, ఉపేందర్, లింగన్న, రోశయ్య, గణేష్ పాల్గొన్నారు.

కేటీఆర్ రోడ్ షోలు సక్సెస్


చౌటుప్పల్ రోడ్ షోలో అభివాదం చేస్తున్న మంత్రి కేటీఆర్, పక్కన మునుగోడు అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డి


కోదాడ రోడ్ షోలో కండువాను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్న మంత్రి కేటీఆర్, పక్కన కోదాడ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్

జంగ్ తెలంగాణ

చౌటుప్పల్, కోదాడ: మంత్రి కేటీఆర్ బుధవారం చౌటుప్పల్, కోదాడలో నిర్వహించిన రోడ్ షోలు సక్సెస్ అయ్యాయి. ఈ రోడ్ షోలకు పార్టీ శ్రేణులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో వచ్చిన కేటీఆర్ చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధి తంగడపల్లిలో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌లో దిగారు. ఆయనకు మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం ప్రచార రథం ఎక్కి ప్రజలకు అభివాదం చేసుకుంటూ తంగడపల్లి రోడ్డు, జాతీయ రహదారి మీదుగా చిన్నకొండూర్ చౌరస్తా వద్దకు చేరుకున్నారు. పార్టీ శ్రేణులు, జనంతో ఆ ప్రాంతం కిక్కిరిసింది. రోడ్ షోలో నాయకులు జెల్ల మార్కండేయులు, పాల్వాయి స్రవంతి, నారాయణపురం జెడ్పీటీసీ వీరమళ్ల భానుమతి, చౌటుప్పల్ సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మున్సిపల్, మండల అధ్యక్షులు ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, గిర్కటి నిరంజన్, మాజీ జెడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు బాబాషరీఫ్, బొడిగె అరుణ, తాడూరి శిరీష, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

కోదాడలో..

చౌటుప్పల్ నుంచి బయల్దేరిన కేటీఆర్ 2.20 నిమిషాలకు కోదాడ బైపాస్ రోడ్డు వద్ద ఉన్న హెలిపాడ్‌కు చేరుకున్నారు. ఆయనకు కోదాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్, నాయకుడు కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి స్వాగతం పలికారు. బొల్లం మల్లయ్య సతీమణి ఇందిర కేటీఆర్‌కు తిలకం దిద్ది ఆహ్వానించారు. అక్కడి నుంచి కారులో ఖమ్మం క్రాస్ రోడ్డుకు చేరుకొని ప్రత్యేక వాహనంలో రోడ్ షో నిర్వహించారు. ఆయనకు క్రేన్ సాయంతో గజమాల వేశారు. ఖమ్మంక్రాస్ రోడ్డు నుంచి రంగా థియేటర్ సెంటర్ వరకు రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేశారు. 3.12 నిమిషాలకు తన ప్రసంగాన్ని ప్రారంభించి 3.27 నిమిషాలకు ముగించారు.

రోడ్ షోలో ఎన్‌ఎస్‌యూఐ నేతల నిరసన

చౌటుప్పల్: ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం చౌటుప్పల్ పట్టణంలో రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ రోడ్ షో నిర్వహించారు. ఈ రోడ్ షో జరుగుతున్న సమయంలో కొందరు ఎన్‌ఎస్‌యూఐ నేతలు ఫ్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, టీఎస్‌పీఎస్సీ ద్వారా ఉద్యోగ నోటిఫికేషన్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్‌ఎస్‌యూఐ మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు రాచకొండ భార్గవ్ ఆధ్వర్యంలో పలువురు నినాదాలు చేశారు. అక్కడే ఉన్న పోలీసులు అప్రమత్తమై వారిని అదుపులోకి తీసుకున్నారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో ఎన్‌ఎస్‌యూఐ నేతలు శివ, శ్రవణ్, దిలీప్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీలోకి మాజీ మున్సిపల్ చైర్మన్


ఖర్గే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బోయినపల్లి కృష్ణారెడ్డి

నల్లగొండ: నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బోయినపల్లి కృష్ణారెడ్డితో పాటు పలువురు మాజీ కౌన్సిలర్లు బీఆర్‌ఎస్‌ని వీడి కాంగ్రెస్‌లో చేరారు. బుధవారం నల్లగొండలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ప్రజా భరోసా సభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఆయనతో పాటు మాజీ కౌన్సిలర్లు మందడి మధుసూదన్‌రెడ్డి, సురిగి మారయ్య, గుబ్బ శ్రీనివాస్ కూడా కాంగ్రెస్‌లో చేరారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

- కేంద్ర సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ కుమార్ వ్యాస్

నల్లగొండ: శాసనసభ సాధారణ ఎన్నికలను అధికారులు సజావుగా నిర్వహించాలని కేంద్ర సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ కుమార్ వ్యాస్ అన్నారు. బుధవారం ఢిల్లీ నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో శాసనసభ ఎన్నికల ఏర్పాట్లపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడడంతో పాటు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నల్లగొండ కలెక్టరేట్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ రూం నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నల్లగొండ జిల్లా పరిధిలోని నల్లగొండ, మునుగోడు, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, నకిరేకల్, దేవరకొండ నియోజకవర్గాల్లో ఈ నెల 30న జరగనున్న పోలింగ్ కొరకు పూర్తిస్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలో ఎన్నికల సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు, ఆయా పోలింగ్ స్టేషన్లలో ఏర్పాట్లు, సెక్టార్, రూట్‌లు, ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ, హోం(వృద్ధులు, దివ్యాంగులు) ఓటింగ్, ఎన్నికల్లో పాల్గొనే పోలింగ్ సిబ్బందికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ తదితర అంశాల గురించి కలెక్టర్ కేంద్ర సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్‌కు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎక్సైజ్ సూపరింటెండెంట్ సంతోష్, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కళాకారుల బృందంపై దాడి

- కళాకారులపై చెప్పు విసిరిన కాంగ్రెస్ కార్యకర్తలు
- గుండాల మండలం సీతారాంపురంలో ఉద్రిక్తత

గుండాల: కాంగ్రెస్ అభ్యర్థికి వ్యతిరేకంగా పాటలు పాడిన బీఆర్‌ఎస్ కళాకారుల బృందంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి తెగబడ్డారు. కళాకారులపై చెప్పు విసిరి జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సీతారంపురం గ్రామంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఆలేరు నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి బుధవారం సాయంత్రం గుండాల మండలంలోని సీతారాంపురంలో ప్రచారం నిర్వహించేందుకు కళాకారులతో కలిసి గ్రామానికి చేరుకున్నారు. అక్కడ ఆమె గ్రామస్తులను కలిసి ఓట్లు అడుగుతుండగా కళాకారులు కాంగ్రెస్ అభ్యర్థి బీర్ల అయిలయ్యకు వ్యతిరేకంగా పాటలు పాడుతున్నారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు అక్కడకు చేరుకున్నారు. కళాకారులపై చెప్పు విసిరి జై కాంగ్రెస్ అంటూ నినదించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఎమ్మెల్యే గ్రామంలో ఏం అభివృద్ధి చేసిందని కాంగ్రెస్ కార్యకర్తలు నిలదీశారు. గ్రామంలో పెన్షన్లు, రేషన్ కార్డులు, దళిత బంధు, బీసీ బంధు అందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు ఆందోళకారులను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.

న్యాయం చేస్తేనే ఓటు వేస్తాం

గుండాల: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ముత్యం సుధాకర్ 2008లో డీఎస్సీకి ఎంపికయ్యాడు. 'మధ్యంతర జీఓ 28 తీసుకొచ్చి డీఎస్సీ 2008లో క్వాలిఫై అయిన అభ్యర్థులకు అన్యాయం చేశారని.. తమకు న్యాయం చేసే వారికే మా కుటుంబం ఓట్లు వేస్తాం' అని సుధాకర్ ఇంటి గోడకు పోస్టర్ అంటించాడు.


తన ఇంటి గోడకు పోస్టర్ అంటిస్తున్న ముత్యం సుధాకర్

డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే సమగ్రాభివృద్ధి


సమావేశంలో మాట్లాడుతున్న రచనారెడ్డి

నల్లగొండ టూటౌన్: అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం (డబుల్ ఇంజన్ సర్కార్) వస్తేనే తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బి.రచనారెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే ప్రస్తుతం ఉన్న క్వింటా ధాన్యం ధరను రూ.2,260 నుంచి రూ.3,100కు పెంచుతామని తెలిపారు. డీఏపీపై సబ్సిడీతోపాటు విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు ఉచితంగా ఇస్తామన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకత్వం విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టో ప్రజలందరికీ ఉపయుక్తంగా ఉందని, దాన్ని గ్రామగ్రామాన ప్రజలకు అర్థమయ్యేలా ప్రచారం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కేసీఆర్ పాలనలో అన్ని స్కీమ్‌లలో స్కామ్‌లేనని, రైతురుణ మాఫీ చేస్తామని చెప్పి విస్మరించారని ఆరోపించారు. సమావేశంలో బీజేపీ నాయకులు పాలకూరి రవిగౌడ్, కొత్త లింగస్వామి పాల్గొన్నారు.

బైక్ చోరీ.. పోలీసులకు నిందితుడి అప్పగింత

కొండమల్లేపల్లి: బైక్ అపహరించి పట్టుబడిన నిందితుడిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన కొండమల్లేపల్లిలో చోటు చేసుకుంది. కొండమల్లేపల్లి మండలం గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన నాస్ లింగం మంగళవారం రాత్రి మండల కేంద్రంలోని సాగర్ రోడ్డులో గల ఓ వైన్స్ ఎదుట తన బైక్‌ను నిలిపి ఉంచాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌ను అపహరించి సమీప పశువుల సంతకు తీసుకెళ్లి స్పేర్ పార్ట్స్ విప్పుతుండగా స్థానికులు గమనించారు. దీంతో ఇద్దరు యువకులను పట్టుకునేందుకు ప్రయత్నించగా వారిలో ఒకరు పారిపోయాడు. మరొకరిని పట్టుకొని చితకబాది పోలీసులకు అప్పగించారు. నిందితుడిని విచారిస్తున్నట్లు ఎస్‌ఐ వీరబాబు తెలిపారు.

క్రీడల్లో మహిళల భాగస్వామ్యం పెరగాలి

- మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ గోపాల్‌రెడ్డి


విజేతలతో మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ గోపాల్‌రెడ్డి, అధ్యాపకులు

ఎంజీయూ(నల్లగొండ రూరల్): క్రీడల్లో మహిళల భాగస్వామ్యం మరింత పెరగాల్సిన అవసరం ఉందని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎంజీయూలో నిర్వహించిన అంతర్ కళాశాల ఖోఖో పోటీలను ప్రారంభించి మాట్లాడారు. జీవితంలో క్రీడా స్ఫూర్తిని కల్గి ఉండి ఉన్నత స్థానంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. అన్ని రకాల క్రీడలను ప్రోత్సహించేందుకు అన్ని వసతులు కల్పించినట్లు తెలిపారు. మహిళల విభాగంలో విజేతలుగా మొదటి స్థానంలో భువనగిరిలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ డిగ్రీ కళాశాల, ద్వితీయ స్థానంలో నల్లగొండ సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల, పురుషుల విభాగంలో మొదటి స్థానంలో రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ద్వితీయ స్థానంలో నల్లగొండలోని ఎన్‌జీ కాలేజీ జట్టు నిలిచింది. విజేతలను వీసీ అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ అలువాల రవి, క్రీడల అధికారులు ఉపేందర్ రెడ్డి, రమావత్ మురళి, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వివిధ శాఖలకు అధిపతుల నియామకం

ఎంజీయూలో వివిధ శాఖలకు అధిపతులను నియమిస్తు రిజిస్ట్రార్ అలువాల రవి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సైన్స్ కళాశాలకు బాటని విభాగం అధ్యాపకులు ప్రేమ్‌సాగర్, ఇంజనీరింగ్ ఆఫ్ సైన్స్‌కు రామచంద్రం, ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ మౌనిక, మెకానికల్ ఇంజనీరింగ్‌కు అశ్విని, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌కు రాజేశ్వరిని నియమించినట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. వీరంతా ఆ పదవిలో రెండేళ్ల పాటు కొనసాగుతారని తెలిపారు.

దేవాలయాలు.. ఆధ్యాత్మిక కేంద్రాలు

- త్రిదండి చిన జీయర్‌స్వామి


మంత్రి జగదీష్‌రెడ్డికి ఆశీర్వచనం ఇస్తున్న త్రిదండి చిన జీయర్‌స్వామి


భానుపురి : దేవాలయాలు.. ఆధ్యాత్మిక కేంద్రాలని, త్రిదండి చిన జీయర్‌స్వామి అన్నారు. సూర్యాపేటలోని వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన మూలవిరాట్ విగ్రహాల భద్రపీఠం పునర్ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆయన హాజరై భక్తులను ఉద్దేశించి ప్రవచించారు. సమాజంలో ప్రతిఒక్కరూ రామాయణం, భాగవతం గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి జగదీష్‌రెడ్డి స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో అహోబిల జీయర్ స్వామి కృష్ణమాచార్యులు, దేవాలయ అర్చకులు నల్లన్ చక్రవర్తుల మురళీధరాచార్యులు, నల్లన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు, దైవ సేవకులు ఉప్పల గోపాలకృష్ణయ్య, వీర్లపాటి సత్యనారాయణ, కొత్తపేట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

ప్రేమ పెళ్లి చేసుకున్న యువకుడిపై హత్యాయత్నం

- కత్తితో దాడి చేసిన యువతి తల్లిదండ్రులు, సోదరుడు
- పరిస్థితి విషమం.. హైదరాబాద్‌కు తరలింపు

వలిగొండ: యాదాద్రి భువనగిరి జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్న యువకుడిపై యువతి తల్లితండ్రులతో పాటు సోదరుడు హత్యాయత్నానికి పాల్పడ్డారు. కత్తులతో దాడి చేయడంతో యువకుడు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. వలిగొండ మండలం వేములకొండకు చెందిన యాట నవీన్ అదే గ్రామానికి చెందిన ఎలగందుల మానస ప్రేమించుకుని 15 మాసాల క్రితం ఇళ్ల నుంచి వెళ్లి వివాహం చేసుకున్నారు. హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగులుగా జీవనం సాగిస్తున్నారు. బంధువు అంత్యక్రియలకు హాజరయ్యేందుకు నవీన్ బుధవారం వలిగొండ మధిర గ్రామం మల్లేపల్లికి వచ్చాడు. దహనసంస్కారాలు పూర్తయిన తర్వాత నవీన్ స్వగ్రామం వేములకొండకు వచ్చాడు. సాయంత్రం ఇంటి సమీపంలోని వాటర్ ఫిల్టర్ వద్ద మిత్రులతో కలిసి మాట్లాడుతున్నాడు. విషయం తెలుసుకున్న మానస తల్లిదండ్రులు మార్కండేయ, సరస్వతి, సోదరుడు మత్స్యగిరి ముగ్గురు కలిసి కత్తితో అక్కడకు చేరుకున్నారు. ఇద్దరు నవీన్‌ను పట్టుకోగా ఒకరు కత్తితో అతడి శరీరంపై ఇష్టానుసారంగా పొడిచారు. ఒకరి తర్వాత మరొకరు నవీన్ శరీర భాగాలపై దాడి చేసి పరారయ్యారు. రక్తపు మడుగులో పడి ఉన్న నవీన్‌ను స్థానికులు, కుటుంబ సభ్యులు తొలుత వలిగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ప్రస్తుతం నవీన్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వలిగొండ ఎస్‌ఐ ప్రభాకర్ తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి చెరువులో పడి మృతి


మల్లయ్య(ఫైల్)

రామన్నపేట: అదృశ్యమైన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపేట మండలం దుబ్బాక గ్రామానికి చెందిన చిర్రబోయిన మల్లయ్య(55) కూలీ పనులతో పాటు గేదెలను కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం తన గేదెతో పాటు గ్రామానికి చెందిన మరొకరి గేదెలను చెరువు సమీపంలోకి తోలుకొని వెళ్లాడు. చెరువు అవతలి పక్కన తన కూతురు పొలం వద్దకు వెళ్తుండగా నీటిలోని బురదలో కూరుకుపోయాడు. మల్లయ్య సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. చెరువు సమీపంలో చెప్పులు, చేతికర్ర ఉండడం గమనించి చెరువులో గాలించారు. చీకటి పడడంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. బుధవారం పోలీసులు గ్రామస్తుల సహకారంతో చెరువువద్దకు వెళ్లి వెతకగా నీట మునిగి మృతి చెంది ఉన్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మయ్య తెలిపారు.